సాక్షి
ఖమ్మం
గురువారం । 5 । జూన్ । 2025



సేంద్రియ రైతుబజార్ రెడీ..

కేవలం సేంద్రియ పంటలు, ఉత్పత్తులే అమ్మేలా రాష్ట్రంలోనే తొలిసారి ఖమ్మంలో ప్రత్యేక రైతుబజార్ ఏర్పాటవుతోంది. 12లో



తనిఖీ చేయాల్సిందే..

పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు ఆదేశించారు. 12లో

గరిష్టం / కనిష్టం
39° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్ట స్థాయికి చేరే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆయిల్‌పామ్‌లో అంతర పంటలతో లాభాలు



తోటలో రైతులతో అధికారులు

ఖమ్మంఅర్బన్: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తూనే నాలుగు రకాల అంతర పంటలు వేసుకోవచ్చని, తద్వారా అదనపు లాభాలు పొందొచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. రఘునాథపాలెం, ఖమ్మం బాలపేటల్లోని ఆయిల్‌పామ్ తోటల్లో బుధవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఆయిల్‌పామ్‌లో వక్క, కోకో, మునగ, సుగంధ ద్రవ్యాల పంటలే కాక కూరగాయలు పంటలు కూడా సాగు చేసుకోవచ్చన్నారు. తద్వారా ఆయిల్‌పామ్ చేతికొచ్చేలోగా ఈ పంటలతో పెట్టుబడి ఖర్చులు తీరతాయని తెలిపారు. ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి నగేష్‌తో పాటు రామకృష్ణ, చంద్రశేఖర్, మానుకొండ రాధాకిషోర్, రామచంద్రు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



డీలర్లకు సూచనలు చేస్తున్న డీఏఓ పుల్లయ్య

ఏన్కూరు: రైతులకు నకిలీలు, అనుమతి లేని విత్తనాలు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య హెచ్చరించారు. వైరా ఏడీఏ టి.కరుణశ్రీతో కలిసి బుధవారం ఆయన ఏన్కూరులోని పలు షాపుల్లో తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు నిల్వల రికార్డులను పరిశీలించాక డీఏఓ మాట్లాడారు. రైతులు కూడా ప్రతీ కొనుగోలుపై బిల్లు తీసుకుని పంట కాలం పూర్తయ్యే భద్రపర్చాలని సూచించారు. అనంతరం ఏన్కూరులో సబ్సిడీపై అందించే జీలుగ విత్తన ప్యాకెట్ల నిలవలను పరిశీలించారు. పచ్చిరొట్ట సాగుతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చని ఆయన తెలిపారు. ఆతర్వాత రైతు వేదికలో ఏఈఓలతో సమీక్షించి ఫార్మర్ రిజిస్ట్రీపై సూచనలు చేశాక ఫౌండేషన్ విత్తనాలు పంపిణీ చేశారు. ఏఓ ఏ.నరసింహారావు, ఏఈఓలు బాలకృష్ణ, శ్రీకాంత్, కమలాకర్, నవ్య, భవ్య, భాగ్యలహరి పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు, మార్కెట్ల తనిఖీ



బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు బియ్యం పంపిణీపై ఆరా తీశారు. డీఎం శ్రీలత, డీలర్ జానీమియా తదిరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం కొత్త బస్టాండ్ పక్కన, వీడీవోస్ కాలనీల్లో ఉన్న సమీకృత మార్కెట్లను అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. మార్కెట్ల నిర్వహణ, స్టాళ్ల ఖాళీగా ఉండడంపై ఆరా తీశారు. అలాగే, వీడీవోస్ కాలనీ సమీకృత మార్కెట్‌లో సేంద్రియ రైతు బజార్ ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వేదికగా 'భూభారతి'

ముదిగొండ: భూసమస్యల పరిష్కార వేదికగా భూభారతి చట్టం నిలవనుందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముదిగొండ మండలం గోకినేపల్లిలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన భూసమస్యలపై రైతుల నుండి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ఆర్ఓఆర్ మార్పులు, చేర్పులు వంటి సేవలు సులభతరమవుతాయని తెలిపారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకుంటూ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్ సునీత ఎలిజబెత్, ఆర్ఐ వహీదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

అదును కోసం ఆశగా..

వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇటీవల వర్షాలతో భూముల్లో తడి చేరింది. దీంతో దుక్కులు దున్నుతున్నారు. ఈనెల 8నుంచి మృగశిర కార్తె ప్రారంభం కాగానే పత్తి నాటేలా విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. అంతేకాక వరి, మెట్టపంటల సాగు సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. కాస్త గట్టి వాన పడితే పంటల సాగు జోరందుకోనుంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

రఘునాథపాలెం మండలం మంచుకొండలో దుక్కి దున్నుతున్న రైతు



ముందస్తు వర్షాలతో..

నైరుతి రుతుపవనాల ఆగమనం, ఉపరితల ఆవర్తనం కారణంగా మే చివరి వారం నుంచే జిల్లాలో వర్షాలు కురిసాయి. దీంతో రైతులు ఆనందంగా వ్యవసాయ పనుల్లో మునిగారు. అడపాదడపా మబ్బులు కమ్మి చిరుజల్లులు కురుస్తుండటండంతో దుక్కులు దున్నడం ప్రారంభమైంది. ఇదే సమయాన రోహిణి కార్తెతో ఎండల ప్రభావం కూడా ఉంది. దీంతో ఓ మోస్తరు వర్షం కురిస్తే వ్యవసాయ పనులు జోరందుకోనున్నాయి.

సాగుకు సిద్ధమవుతున్న రైతాంగం

- తాజా వర్షాలతో పొలాల్లో దుక్కులు
- మృగశిర రాగానే పత్తి విత్తనాలు వేసేలా ప్రణాళిక
- ఈసారి జిల్లాలో పత్తి సాగు పెరుగుతుందని అంచనా

పెరగనున్న పత్తి సాగు

ఈ వానాకాలంలో పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. గత ఏడాది 2లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా.. ఈసారి 2,20,550 ఎకరాలకు చేరొచ్చని అంచనాల్లో పొందుపర్చారు. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు తెగుళ్లతో దిగుబడి కోల్పోవడమే కాక ఆశించిన స్థాయిలో ధర రాలేదు. దీనికి తోడు ఈసారి పత్తి మద్దతు ధర పెరిగిన నేపథ్యాన రైతులు ఎక్కువగా పత్తి సాగుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. జిల్లాలో పంట సాగుకు 6,61,650 ప్యాకెట్ల విత్తనాలు అవసరం కాగా, ఇప్పటికే జిల్లాకు 6,01,987 ప్యాకెట్లు చేరాయి. విత్తన దుకాణాల్లో వివిధ కంపెనీలకు సంబంధించి బీటీ–2 విత్తనాలు సైతం అందుబాటులో ఉన్నాయి.

పదును చూసి విత్తుకుంటేనే..

మరోమారు వర్షం కురిస్తే పత్తి విత్తనాలు విత్తాలనే భావనలో రైతాంగం ఉంది. 6 – 7 సెం.మీ. వర్షం కురిస్తే భూమి పదును వచ్చి సాగుకు అనుకూలంగా మారుతుందని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈనెల 10వ తేదీ తర్వాత విత్తనాలు వేసుకుంటే మంచిదని చెబుతుండడంతో నల్లరేగడి భూముల్లో పత్తి సాగుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరు పొడి దుక్కుల్లో విత్తేందుకు సిద్ధమవుతూ, వర్షం కురవగానే మొక్క వస్తుందనే ఉద్దేశంతో ఉన్నారు. అయితే, ఈనెల 10 నుంచి జూలై 20 వరకు పత్తి విత్తనాలు నాటొచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ఇతర పంటలకూ అనుకూలం

ప్రస్తుత వాతావరణం వరితో పాటు మెట్ట పంటల సాగుకు సైతం అనుకూలంగా ఉంది. ఇప్పుడే వర్షాలు కురుస్తుండడం, జలాశయాల్లో కూడా సమృద్ధిగా నీరు ఉండడంతో వరి సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా. అంతేకాక వరి పంటకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండడంతో ఎక్కువ మంది సన్న రకం సాగుకే నిర్ణయించుకున్నారు. ఈ వానాకాలంలో 2.85 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. వరి ఆగస్టు వరకు వేసుకునే అవకాశముంది. కాగా, పెసలు, కందులు వంటి మెట్ట పంటలు కూడా సాగు చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నకిలీ విత్తనాలతో ఆందోళన

ప్రస్తుతం వివిధ కంపెనీల విత్తనాలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ఈ క్రమంలో నకిలీలు, నిషేధిత విత్తనాలు ఎవరూ అమ్మకుండా వ్యవసాయ శాఖ, పోలీసుల ఆధ్వర్యానటాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీ చేపడుతున్నాయి. అయినా జిల్లాలోని పలు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు పట్టుబడడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఏన్కూరు, మధిరల్లో నకిలీ విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు కేంద్రంగా నకిలీ విత్తనాల తయారీ కుటీర పరిశ్రమగా కొనసాగుతోంది. ఖమ్మం తదితర జిల్లాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేస్తున్నారు. ఈ నకిలీ విత్తనాలను కట్టడి చేయడంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు నిమగ్నం కాగా, జిల్లాకు సరిహద్దుగా ఉన్న ప్రాంతాల్లో 14 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

పథకాల్లో రాజకీయాలు ఉండవు...



ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, తదితరులు

- దశల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందించడంలో రాజకీయాలకు తావుండదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. రూరల్ మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి లబ్ధిదారులకు ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తే వారి నుంచి వచ్చే స్పందన అద్భుతంగా ఉంటుందని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా మొదటి దశలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించగా, దశల వారీగా అందరికీ మంజూరు చేస్తామన్నారు. కాగా, రూరల్ మండలంతో పాటు కేఎంసీ పరిధి 60వ డివిజన్ రామన్నపేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూనే సకాలంలో పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్లు అభిషేక్ అగస్త్య, శ్రీనివాసరెడ్డి, ఆర్‌డీఓ నర్సింహారావు, తహసీల్దార్ రాంప్రసాద్, డీఎల్‌పీఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

కూసుమంచి: అనారోగ్యంతో బాధపడే పేదలు చికిత్స చేయించుకునేలా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో 348 మందికి రూ.1.58 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన బుధవారం అందజేసి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10లక్షల విలువైన వైద్యసేవలు ఉచితంగా అందిస్తూనే, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.వందలాది కోట్ల సాయం మంజూరు చేస్తున్నామని తెలిపారు. కూసుమంచి మండలంలోని గట్టు సింగారం, గైగోళ్లపల్లి, పాలేరు, చేగొమ్మ, నాయకన్ గూడెం గ్రామాల్లో బీటీ, సీసీ రహదారుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం జరిగిందని పలువురు పేర్కొనగా విచారణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డితో పాటు మల్లె గురవయ్య, జూకూరి గోపాలరావు, రామసహాయం వెంకటరెడ్డి, ఎడవెల్లి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారమే కీలకం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రఘునాథపాలెం: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేసే బాధ్యత వంట సిబ్బందిపై ఉందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలం కోయచలక క్రాస్ వద్ద గురుకులంలో సాంఘిక సంక్షేమ శాఖ, విద్యాశాఖ పరిధిలోని గురుకులాల వంట సిబ్బందికి బుధవారం ఇచ్చిన నైపుణ్య శిక్షణను కలెక్టర్ పరిశీలించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించాక ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యవంతమైన, రుచికరమైన ఆహారం అందించడంలో వంట సిబ్బంది కీలకంగా వ్యవహరించాలన్నారు. తల్లిప్రేమతో కూడిన భోజనం అందిస్తే విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తారని తెలిపారు. అనంతరం ఆహార తనిఖీలకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు కేటాయించిన వాహనాన్ని పరిశీలించిన కలెక్టర్, అందులోని యంత్రాల పనితీరుపై ఆరాతీశారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల డీడీలు కస్తాల సత్యనారాయణ, ఎన్.విజయలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వంటల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

ఖమ్మం సహకారనగర్: వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సన్మానించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి వివిధ శాఖల అధికారులు జి.గురువయ్య, ఎం.మోహన్, జి.ఉమాదేవి, ఎస్.వసంత, వై.సరస్వతి, సీహెచ్.రాజకొమురమ్మ, టి.నాగేశ్వరరావు, వై.వీ.రమణ, జి.అప్పమ్మ, ఎం.డీ.రఫీ అహ్మద్‌ను సన్మానించి విధినిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. అలాగే, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీగా పనిచేస్తూ 2012 జూలైలో ఉద్యోగ విరమణ చేసిన బి.రమాదేవితో 'ప్రస్థానం' పేరిట మాట్లాడారు. అప్పట్లో జిల్లా పరిస్థితులు, ఉద్యోగ నిర్వహణలో ఎదురైన సవాళ్లు, వాటిని ఎలా అధిగమించారు, ఉద్యోగంలో సాధించిన ఘనతలు, ప్రభుత్వ పథకాలనుఅర్హులందరికీ చేర్చడంలో తీసుకున్న జాగ్రత్తలను ఆరా తీయడమే కాక విధినిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రస్తుత ఉద్యోగులకు సూచనలు ఇప్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ దీక్షారైనా, డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖాధికారి జి.జ్యోతి, ఉద్యోగులు అరుణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో నమ్మకం పెంచేలా వైద్యసేవలు

- సీహెచ్‌సీలో తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ శ్రీజ
- హాజరు పట్టికలో ఉద్యోగుల తప్పుడు సంతకాలపై సీరియస్

తిరుమలాయపాలెం: ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచేలా వైద్యులు, సిబ్బంది వైద్యసేవలందించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం తనిఖీ చేసిన ఆమె చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ఆతర్వాత ఫార్మసీ, పరీక్ష గది, ఆస్పత్రిలో మందుల నిల్వలు, గర్భిణులకు అందుతున్న సేవలు, పరీక్షలపై ఆరా తీశారు. గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తూ సాధారణ ప్రసవాలకు ప్రోత్సహించాలని వైద్యులకు సూచించారు.

డ్యూటీలో లేకున్నా సంతకాలా?

ఆస్పత్రిలో ఉద్యోగుల హాజరు రికార్డు పరిశీలించగా విధుల్లో లేని డాక్టర్ల సంతకాలు ఉండడంతో అదనపు కలెక్టర్ శ్రీజ మండిపడ్డారు. డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్‌కు ఫోన్ చేసి వైద్యులు గైర్హాజరవుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అలాగే, రాత్రి సమయాన పీహెచ్‌సీకి సిబ్బంది, దంత వైద్యుడికి డ్యూటీ వేయడంపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సక్రమంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. తల్లీపిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె తెలిపారు. డాక్టర్లు అమర్‌సింగ్, సురేష్, ప్రదీప్‌రెడ్డి, హారిక తదితరులు పాల్గొన్నారు.



చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కొత్త కార్డులొస్తున్నాయ్..

- ఇప్పటికే 5,298 రేషన్‌కార్డులు మంజూరు
- చేర్పులతో 61,667మందికి లబ్ధి
- మూడు నెలల బియ్యంతో రెట్టింపు ఆనందం



ఖమ్మం సహకారనగర్: పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డుల మంజూరు లేకపోవడంతో పెద్దసంఖ్యలో పేదలు ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యాన రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించడమే కాక దరఖాస్తులు సైతం స్వీకరించింది. ఈమేరకు విచారణ చేపడుతూ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడమే కాక పాత కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యుల పేర్లు సైతం చేరుస్తున్నారు.

విచారణ చేపడుతూ...

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 748 రేషన్ షాప్‌లు ఉన్నాయి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు ఇచ్చేలా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ వేగవంతం చేసింది. జనవరి నుంచి మే నెల వరకు 5,298 కొత్త రేషన్ కార్డులు జారీ చేశారు. అయితే, ఇంకా 48,971 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యాన వీటి పరిశీలనలో అధికారులు వేగం పెంచారు. ఇదే సమయాన అనర్హుల కార్డులను తొలగిస్తున్నారు. అంతేకాక కార్డుదారుల పిల్లల పేర్లు, వివాహాలైన వారి భార్య పేరు నమోదుకు 42,787దరఖాస్తులు అందాయి. వీటిని సైతం పరిశీలించి 61,667మంది పేర్లను కార్డుల్లో చేర్చారు. కాగా, కొత్త కార్డుల జారీతో జిల్లాలో రేషన్‌కార్డుల సంఖ్య 4,15,905కు చేరగా వీటి పరిధిలో 12,03,943మంది లబ్ధిదారులు ఉన్నారు.

జనవరి నుంచి మే వరకు కార్డుల జారీ ఇలా..

కేటగిరీ	కార్డులు	లబ్ధిదారులు
కొత్తవి	5,298	16,127
పేర్ల చేర్పులు	42,787	61,667
మొత్తం	48,085	77,794

ఒకేసారి మూడు నెలల బియ్యం

కొత్తగా రేషన్‌కార్డు రావడమే కాక ఒకేసారి మూడు నెలల బియ్యం ఇస్తుండడంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వర్షాకాలం సీజన్ కారణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పాత, కొత్త కార్డుదారులందరికీ మూడేసి నెలల బియ్యాన్ని డీలర్లు సరఫరా చేస్తున్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు



రేషన్‌కార్డుల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాక అర్హులకు కార్డులు జారీ చేస్తున్నాం. ఇప్పటికే 5,298 కొత్త రేషన్ కార్డులు ఇవ్వగా, మిగతా దరఖాస్తుల పరిశీలన వేగంగా జరుగుతోంది. అర్హులెవరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

వన మహోత్సవానికి సిద్ధం

- కేఎంసీ పరిధిలో 2.50లక్షల మొక్కలు నాటేలా ప్రణాళిక
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొదటి దఫా..
- తొలిరోజు డంపింగ్‌యార్డులో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వనమహోత్సవం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తొలుత గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డంపింగ్‌యార్డులో మొక్కలు నాటాలని నిర్ణయించారు. కాగా, వన మహోత్సవం సందర్భంగా 2.50 లక్షల మొక్కలు నాటాలనేది లక్ష్యం కాగా, ఇందులో లక్ష మొక్కలను ఇంటింటా పంపిణీ చేస్తారు. మిగతా మొక్కలు వివిధ ప్రాంతాల్లో నాటేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో కొన్నిమొక్కలు స్థానిక నర్సరీల్లో సిద్ధంగా ఉండగా, మిగతావి హైదరాబాద్ నుంచి తెప్పిస్తారు.

నేడు డంపింగ్‌యార్డులో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కేఎంసీ పరిధిలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించగా, తొలుత నగరంలో ప్రదర్శన నిర్వహించి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తారు. ఆ తర్వాత డంపింగ్‌యార్డులో ఒకేరోజు దాదాపు వెయ్యికి పైగా మొక్కలు నాటాలని నిర్ణయించారు.



కేఎంసీ ఆధ్వర్యాన నర్సరీలో పెంచిన మొక్కలు

నర్సరీల్లో లక్ష మొక్కలు

ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయగానే వన మహోత్సవం నిర్వహించేలా అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కేఎంసీ పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేసి లక్ష మొక్కలను పెంచారు. ఇందులో ఎక్కువగా మందార, గన్నేరు, గులాబీ పూలతో పాటు నిమ్మ, ఉసిరి, టికోమ, సీతాఫలం, అలంకరణ మొక్కలు ఉన్నాయి. వీటన్నింటినీ ఇంటింటా పంపిణీ చేస్తారు. గతంలో ప్రజలు ఏమేం మొక్కలు ఎక్కువగా అడిగారో పరిగణనలోకి తీసుకుని వీటిని సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఇక వన మహోత్సవానికి కావాల్సిన మరో 1.50 లక్షల మొక్కలను హెచ్‌ఎండీఏ నుంచి తెప్పించేలా కేఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. రవాణా ఖర్చు భరిస్తే ఉచితంగా మొక్కలు ఇచ్చేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు ముందుకొచ్చారు. దీంతో మహాగని, బాదం, పొగడ, స్పాతోడియా తదితరాలే కాక కావాల్సిన రకాలు తెప్పించి ఎంపిక చేసిన ప్రదేశాల్లో ప్రభుత్వ షెడ్యూల్ విడుదల చేయగానే నాటనున్నారు.

రెడీగా మొక్కలు



ఈ ఏడాది వన మహోత్సవంలో నాటేందుకు 2.50 లక్షల మొక్కలను సిద్ధం చేశాం. ఇంటింటా పంపిణీ చేసేలా కేఎంసీ నర్సరీల్లో లక్ష మొక్కలు పెంచాం. మొక్కలను నాటడమే కాక సంరక్షించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం.

– బెల్లం రాధిక, ఉద్యానాధికారి, కేఎంసీ

క్లుప్తంగా

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాల్సిందే...



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాదరావు

బోనకల్/కొణిజర్ల: చెక్‌పోస్టు మీదుగా వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి అన్ని పత్రాలను పరిశీలించాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు బోనకల్ మండలంలోని జానకీపురం క్రాస్, కొణిజర్ల మండలం బస్వాపురం క్రాస్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులను బుధవారం ఆయన పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని పరిశీలిస్తూ పశువుల రవాణాకు అనుమతిపత్రాలు లేని వాటిని అడ్డుకోవాలని తెలిపారు. ఇవి కాక ఇతర సంస్థల వాహనాలను ఆపొద్దని పేర్కొన్నారు. బోనకల్ ఎస్‌ఐ పొదిలి వెంకన్న, పోలీసు ఉద్యోగులు పాల్గొన్నారు.

'నో డ్రగ్స్.. సేవ్ లైఫ్' అంటూ ప్రచారం



పండితాపురం సంతలో ప్రచారం చేస్తున్న ప్రభాకర్

కామేపల్లి: మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత జీవితాలు కోల్పోకుండా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అవగాహన కల్పిస్తున్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ రద్దీ ఉండే జాతరలు, ఉత్సవాలు, వారాంతపు సంతల వద్దకు వెళ్లి మత్తు పదార్థాల వినియోగంతో నష్టంపై వివరిస్తున్నారు. కామేపల్లి మండలం పండితాపురం వారాంతపు సంతకు బుధవారం ఆకట్టుకునేలా వేషధారణతో వచ్చిన ఆయన కరపత్రాలు, ఫ్లెక్సీ ద్వారా స్థానికులకు అవగాహన కల్పించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో సత్తా




అథ్లెట్లతో డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–10, 12 అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న డి.లోహిత, సీహెచ్.లాస్య అండర్–10 విభాగంలో, అండర్–12 బాలికల విభాగంలో ఎం.భవిత, బి.రుత్విక, బాలుర అండర్–12లో డి.ఉపేక్షిత్ ఈ.వరుణ్ బహుమతులు సాధించారు. క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ బుధవారం అభినందించారు.

యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం

ఖమ్మంక్రైం: ప్రియురాలు ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, ఆమె బంధువులు వేధిస్తున్నారంటూ ఓ యువకుడు యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఖమ్మం రమణగుట్ట ప్రాంతానికి చెందిన వట్టికూడి సందీప్ జూబ్లీక్లబ్ ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించాడు. వీరి పెళ్లికి ఆమె తల్లి నిరాకరించడంతో యువతి ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సందీపే కారణమని యువతిబంధువులు వేధిస్తున్నారంటూ సందీప్ బుధవారం యాసిడ్ తాగాడు. ఘటనపై ఆయన కుటుంబీకులు ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మధిర: ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై త్రివిధ దళాలకు వందనం చెబుతూ మధిరలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులను మట్టుబెట్టడమే కాక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడం ద్వారా దేశ సైనికుల సత్తా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ.కొండలరావు, గల్లా సత్యనారాయణ, నెల్లూరు కోటేశ్వరరావు, ఎస్.కే.మహమ్మద్ ముజాయిదీన్ మాట్లాడగా ఏలూరి నాగేశ్వరావు, చావా వేణు, చేకూరి కృష్ణారావు, రషీద్, గాలిమ్, కురువెళ్ల కృష్ణ, చెరుగుడ్ల నర్సింహారావు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,748

సేంద్రియ రైతుబజార్ రెడీ...

- రాష్ట్రంలోనే తొలిసారి ఖమ్మంలో ఏర్పాటు
- ధ్రువీకరించిన 26మంది రైతులకు అవకాశం
- త్వరలోనే ప్రారంభానికి ఏర్పాట్లు





ఖమ్మంలో ప్రారంభానికి సిద్ధమైన సేంద్రియ రైతు బజార్, (ఇన్‌సెట్) రైతు బజార్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలోనే తొలిసారిగా ఖమ్మంలో సేంద్రియ రైతు బజార్(ఆరోగ్య మార్కెట్) ఏర్పాటవుతోంది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులతో పండించిన ఆహార పంటలు ఆరోగ్యానికి హానీ కలిగిస్తున్నాయనే భావన పెరుగుతుండగా.. ప్రజలు ప్రకృతి సిద్ధంగా పండించిన పంటల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో వీటిని ఒకే చోట అందుబాటులోకి తీసుకొచ్చేలా ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సమీకృత మార్కెట్ ఆవరణలో సేంద్రియ రైతుబజార్ ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఈ షెడ్‌ను చికెన్, మటన్, చేపల అమ్మకానికి ఏర్పాటుచేసినా సత్ఫలితాలు రాకపోవడంతో సేంద్రియ రైతు బజార్‌కు కేటాయించారు. జిల్లాలో సేంద్రియ విధానాలతో ఆహార పంటలు, ఉత్పత్తులు చేస్తున్న రైతుల వినతితో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

అమ్మకాలకు రైతుల గుర్తింపు

సేంద్రియ విధానంలో పంటలు పండించే రైతులతో పాటు ఇతర ఉత్పత్తులు తయారుచేసే వారిని ఇప్పటికే ఉద్యోగులు గుర్తించారు. వ్యవసాయ, ఉద్యాన తదితర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ధ్రువీకరించాక వీరిని అమ్మకాలను అనుమతిస్తారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యం, చిరుధాన్యాలు, పండ్లతో పాటు గానుగ నూనెలు, మిరప, పసుపు పొడి, కంది, పెసర, మినుములు, పాలను ఇక్కడ అమ్మనున్నారు. ఈ మేరకు మార్కెట్‌లో 26 స్టాళ్లు ఏర్పాటుచేసుప్తండగా... కూరగాయలు, ఆకుకూరలు, బియ్యం పండించే రైతులే కాక గానుగ నూనె, పప్పులు, పాలు, మసాలా పొడులు, జ్యూట్ బ్యాగులు తయారుచేసే 13 మందిని ఎంపిక చేశారు. మరో 13 మంది గుర్తింపునకు దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది.

మొదటిసారి ఖమ్మంలో...

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మంలో తొలిసారిగా సేంద్రియ రైతు బజార్ ఏర్పాటవుతోంది. పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరల విక్రయానికి రైతు బజార్లు కొనసాగుతున్నాయి. ఖమ్మంలో కూడా రైతు బజార్ల నిర్వహణ ఉంది. అయితే ప్రత్యేకంగా సేంద్రియ విధానంలో పండించే పంటలు, ఉత్పత్తుల కోసం ప్లాస్టిక్ రహితంగా ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కేటాయించిన షెడ్‌కు రంగులు వేసి బోర్డు ఏర్పాటుచేశారు. త్వరలోనే ఈ మార్కెట్‌ను ప్రారంభించేందుకు జిల్లా అధికారులు సన్నాహాల్లో నిమగ్నమయ్యారు.

సేంద్రియ ఉత్పత్తిదారులకే అవకాశం



ప్రత్యేకంగా ఏర్పాటుచేస్తున్న రైతు బజార్‌లో సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటలు, ఇతర ఉత్పత్తుల అమ్మకానికి అనుమతిస్తాం. అలాగే, మసాలా పొడులు, నూనెలు, జూట్ బ్యాగ్‌లు కూడా అమ్మేలా చూస్తాం. తొలుత ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన విక్రయదారులను ధ్రువీకరిస్తాం.

– మధుసూదన్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి

కనీస మద్దతు ధర కోసం చట్టం చేయాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు

బోనకల్: రైతులు సాగు చేసే అన్ని పంటలకు కనీస మద్దతు ధర దక్కేలా చట్టం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు డిమాండ్ చేశారు. బోనకల్ మండలం రావినూతలలో బుధవారం నిర్వహించిన సంఘం మధిర డివిజన్ సదస్సులో ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. విత్తనాల తయారీ బహుళజాతి సంస్థల చేతుల్లో ఉండడంతో రైతులకు నష్టం జరుగుతోందని తెలిపారు. కేంద్రప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా కార్పొరేట్లకు వేలాది ఎకరాలు కట్టబెడుతోందని ఆరోపించారు. ఇకనైనా స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలుచేయాలని కోరారు. కాగా, జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్న సీతారామ ప్రాజెక్టు పూర్తికావడం లేదని, ఈ విషయమై పోరాటానికి రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతుసంఘం మధిర డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పాపినేని రామనర్సయ్య, దొండపాటి నాగేశ్వరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, ఆహారం, ఔషధాలు, ఇంధనం కొరతతో క్యూబా దేశ ప్రజల జీవనం దుర్భరంగా మారినందున సాయానికి అందరూ ముందుకు రావాలని పోతినేని కోరారు. ఈక్రమంలో సమావేశానికి హాజరైన రైతులు సమకూర్చిన రూ.28,115 నగదును సుదర్శన్‌రావుకు నాయకులు అందజేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబుతో పాటు పొన్నం వెంకటేశ్వరావు, చింతలచెర్వు కోటేశ్వరావు, మడిపల్లి గోపాల్‌రావు, కిలారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొదలుకు నిప్పు.. వాహనంపై పడిన చెట్టు

ముగ్గురికి తీవ్రగాయాలు



రహదారిపై పడిన చెట్టు

తిరుమలాయపాలెం: రోడ్డుపై వెళ్తున్న వాహనంపై భారీ వృక్షం పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుమలాయపాలెం కొక్కిరేణి స్టేజీ సమీపాన బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలు... పంటలపై నీడ పడుతోందని కొందరు రైతులు రహదారి పక్కన చెట్ల మొదళ్లకు నిప్పు పెడుతున్నారు. ఇలాగే చేయడంతో చెట్టు ఒక్కసారిగా కూలగా అదే రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనంపై పడింది. దీంతో వాహనంపై వెళ్తున్న బీసురాజుపల్లితండాకు చెందిన బోడ సేవ్యా, పద్మ, సుధాకర్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు చేరకుని జేసీబీతో చెట్టును తొలగించారు.

విధులకు ఆటంకపర్చిన ఇద్దరిపై కేసు

కారేపల్లి: అటవీ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కారేపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కారేపల్లి అటవీ రేంజ్ పరిధి గేటు రేలకాయలపల్లిలో ధర్మసోత్ సూర్యం, ఆయన కుమారుడు జేసీబీతో అటవీ భూమిలో దున్నుతున్నారు. ఈ సమాచారం అందుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఇమ్మడి వీరభద్రం, బీట్ ఆఫీసర్ రమాదేవి వెళ్లి అనుమతి పత్రాలు అడగగా సూర్యం, ఆయన కుమారుడు అసభ్య పదజాలంతో దూషిస్తూ ఉద్యోగులను గెంటేశారు. దీంతో ఉద్యోగుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.గోపి తెలిపారు.

చేపల కోసం చెరువు నీళ్లు వదిలారు...



నల్ల చెరువు నుంచి బయటకు వెళ్తున్న నీరు

వైరా: అన్నదాతలకు ఆదెరువుగా, మత్స్యకారులకు అండగా నిలుస్తున్న నిండా నీరు ఉండగా.. చేపలు పట్టడం సాధ్యం కావడం లేదని కాంట్రాక్టర్ నీరు విడుదల చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరంలోని నల్ల చెరువు నీటిని అనుమతి కాంట్రాక్టర్ చేపల వేట కోసం వదిలినట్లు సమాచారం. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులో 3.5 అడుగుల మేర నీరు ఉంది. అయితే, నీరు విడుదల చేయడానికి నీటి పారుదల శాఖ అధికారుల అనుమతి అవసరం కాగా, అదేమీ లేకుండా మూడు రోజులుగా నీటిని వృథాగా విడుదల చేయడంతో చెరువు ఖాళీ అయ్యే స్థితికి చేరింది. మత్స్య సొసైటీ అధ్యక్షుడు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఈ ఘటనకు పాల్పడినట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. అలాగే, సుమారు 250 ఎకరాల మేర వరి నాట్లకు ఇబ్బంది ఏర్పడనుందని రైతులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా నీటి పారుదల శాఖ, మత్స్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఐబీ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా చెరువులో చేపల వేట కోసం గుర్తుతెలియని వ్యక్తులు నీరు వదిలినట్లు ఆలస్యంగా తెలిసిందని, బాధ్యులను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం చెరువు వద్ద లష్కర్లతో పహారా ఏర్పాటు చేశామని వెల్లడించారు

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందుకున్న కేడెట్లతో అధికారులు

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థినులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్‌సీసీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రజిత తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో వారికి ఖమ్మం 11(టీ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్ భద్ర బీ, సీ సర్టిఫికెట్లు అందజేశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై ప్రిన్సిపాల్ రజిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, కోఆర్డినేటర్లు ఐశ్వర్య, రజిని, రాజేశ్వరి, సీటీఓ శోభాదేవిని అభినందించారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తి నగర్: ఖమ్మం, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లోని ఈఎస్‌ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్‌లో ఉద్యోగుల ఎంపికకు శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి మాధవి తెలిపారు. వివిధ స్థాయిలో 54 పోస్టులు ఉండగా, ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలని ఆమె ఓ ప్రకటనలో సూచించారు.

ముంచుకొస్తున్న ముప్పు..

- నానాటికీ పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- వివిధ కారణాలతో తరుగుతున్న అడవులు
- వాతావరణ సమతుల్యతకు మరింత విఘాతం
- పర్యావరణ పరిరక్షణే మార్గమంటున్న నిపుణులు

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



జిల్లాలోని అటవీ ప్రాంతం

చుంచుపల్లి: మానవ మనుగడలో పర్యావరణం కీలకపాత్ర పోషిస్తుంది. అయితే కొన్నేళ్లుగా మానవ తప్పిదాలు, ఇతర కారణాలతో ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయి. విలువైన సహజ సంపదను కాపాడుకునే దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేస్తేనే భావితరాలు సాఫీగా సాగుతాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. విచక్షణా రహితంగా చెట్ల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం, పరిశ్రమల నుంచి వచ్చే విష వాయువులు, వ్యర్థాలతో భూతాపం పెరగడం, భూ, వాయు, జల కాలుష్యాలు పెరుగుతుండడం వంటి ప్రతికూల పరిస్థితులను అధిగమించాలంటే ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఇందుకోసం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తారు.

అడవుల తగ్గుదలతో ఆందోళన

అడవుల అభివృద్ధితోనే పర్యావరణ సమతుల్యతను కాపాడటం అనేది సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. పలు రకాలైన జంతు, వృక్ష జాతులకు ఆశ్రయం కల్పించి జీవవైవిధ్యాన్ని సంరక్షించేందుకు తోడ్పడతాయి. అడవులు భూసారాన్ని కాపాడమే కాకుండా నేల క్షీణతను నిరోధిస్తాయి. ఒక విధంగా చెప్పాలంటే మానవ మనుగడకు అడవులే ఆధారం. 2021 నుంచి 2023 వరకు భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో అటవీ విస్తీర్ణం తగ్గటం ఒకింత ఆందోళన కలిగించే అంశం. ఉమ్మడి జిల్లాలో మూడేళ్ల వ్యవధిలో 121.21 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం తగ్గినట్లు ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్–2023ను గతేడాది డిసెంబర్‌లో వెల్లడించింది. 2021–23 మధ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 95.55 చ.కి.మీ. ఖమ్మం జిల్లాలో 25.76 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం తగ్గిందని నివేదికలో పేర్కొంది. 2021 కాలంలో 2,957.21 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం కలిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 2023 చివరి నాటికి 2,861.66 చ.కి.మీ.కి తగ్గినట్లు తెలిపింది. ఇక ఖమ్మం జిల్లాలో 2021 కాలంలో 633.23 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం ఉండగా, 2023 ముగిసే నాటికి 607.47 చ.కి.మీ.గా నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణం తగ్గిన జిల్లాల జాబితాలో ఆదిలాబాద్ (–115.50) తర్వాత భద్రాద్రి జిల్లా (–95,55) రెండో స్థానంలో నిలవగా, ఖమ్మం మూడో స్థానంలో ఉందని వివరించింది. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం, కిన్నెరసాని, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు.. తదితర ఎనిమిది అటవీ డివిజన్లలో ఒక్క కిన్నెరసాని వైల్డ్‌లైఫ్‌లో తప్ప మిగతా వాటిలో అటవీ విస్తీర్ణం తగ్గినట్లు నివేదిక పేర్కొంది. అక్రమణలు, అగ్ని ప్రమాదా అందుకు కారణమని, అగ్ని ప్రమాదాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటిస్థానంలో ఉన్నట్లు తేలింది.

ఉమ్మడి జిల్లాలో అటవీ విస్తీర్ణం (చ.కి.మీ.ల్లో)

	భద్రాద్రి జిల్లా	ఖమ్మం జిల్లా
అటవీ డివిజన్లు	06	02
దట్టమైన అడవులు	637.34	42.68
మధ్యస్థాయి అడవులు	1,502.70	261.44
ఓపెన్ అడవులు	721.60	303.30

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



పర్యావరణానికి చాలా ప్రమాదం పొంచి ఉందనేది ఇప్పటికే తెలుస్తోంది. అటవీశాఖ అన్ని చోట్ల మొక్కలు నాటే ప్రక్రియ కు శ్రీకారం చుడుతోంది. ఏటా వనమహోత్సవం పేరుతో లక్షలాది మొక్కలను నాటి సంరక్షిస్తోంది. అటు స్వచ్ఛంద సంస్థలు తమవంతు ముందుకు వచ్చి ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి. యువతీ, యువకులు ఒక మొక్కను పెంచే బాధ్యత తీసుకొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి.

–కిష్టాగౌడ్, డీఎఫ్‌ఓ, భద్రాద్రి కొత్తగూడెం

విశ్వకర్మ పథకాన్ని సంపూర్ణంగా అమలుచేయాలి



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బడుగు, బలహీనవర్గాల ప్రజల్లో వృత్తి నైపుణ్యాలను పెంచేలా కేంద్రప్రభుత్వం రూపొందించిన విశ్వకర్మ పథకాన్నిపూర్తిస్థాయిలో అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా 18వర్గాలకు చెందిన చేతివృత్తిదారులకు జీవనోపాధి కల్పించాలని బుధవారం డీఆర్‌ఓ పద్మశ్రీకి వినతిపత్రం అందజేశారు. అనంతరంకోటేశ్వరరావు మాట్లాడుతూ చేతి వృత్తిదారులకు శిక్షణ ఇవ్వడమే కాక ఆతర్వాత రూ.లక్ష రుణం మంజూరు చేయాలని, ఇందుకోసం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు మందడపు సుబ్బారావు, నర్సింహారావు, రవి రాథోడ్, చంద్రశేఖర్, నరేష్, ఆర్‌వీఎస్.యాదవ్, ఈదుల భద్రం, అంకతి పాపారావు, నాగేశ్వరరావు, రామారావు, వెంకట్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

- 160 గజాల స్థలంలో 2 బెడ్‌రూం పడమర ఫేసింగ్‌లో వున్న ఇల్లు అమ్మకానికి కలదు. ఏదులాపురం దగ్గర కె.ఎల్.ఆర్. బృందావన్ వెంచర్, ఖమ్మం. సునీల్ 7386622732, 8919685015. [M-13538]

Services

BUSINESS OFFER

- Need Monthly Returns ? Get International Capital Market Trading, Profit Sharing/Fixed Profit Safe&Secure. Ph: 9392151984 [SCA25004553]

Wanted

- ఖమ్మం వెలాసిటీ Net Work నందు పని చేయుటకు సేల్స్ మార్కెటింగ్, టెలికాలర్స్, ఫైబర్ టెక్నీషియన్స్, హెల్పర్స్ వెంటనే కావలెను. 9948544438, 8886661780. [SCA25004281]
- కేర్ టేకర్స్ (M/F), నర్సులు, ఆయాలు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు, అత్యధిక జీతం+వ+భో. ఏజెంట్ కమీషన్ 6 వేలు. ✆ 91608 35559, 78158 35561 [B-84]
- ప్రముఖ కాంట్రాక్టు సర్వీస్ నందు పనిచేయుటకు స్త్రీ / పు కావలెను. 10th, Inter, డిగ్రీ వారు కావలెను. జీ: 15–20వేలు. సం.ప్ర. 9441912690 [SCA 25004577]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792



గమనిక